# చిట్టి

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

అది బొమ్మల నోముకు ఆరంభదినం. వన్నెవన్నెలచీని చీనాంబరాలూ రకరకాల స్వర్ణాభరణాలూధరించి స్త్రీలూ బాలికలూ మేళతాళాలతో సావిత్రీగారు వెంట ఊరేగుతున్నారు. చిట్టి ఆఉత్సవం చూచింది. తానూ వారిలో ఒకతై ఉత్సవంతో వెళ్లితే ఎంతబాగుంటుంది అనుకున్నది. మనస్సు సంతోషంతో నిండిపోయింది. తనువు ఉత్సాహంతో పొంగిపోయింది. ఆపుకోలేక పోయింది. ఒక్కగంతుతో అమ్మదగ్గిరకు పోయింది. దొడ్లో నిర్జీవప్రతిమలాగ వాళ్ళమ్మ యేదో పనిచేసుకుంటున్నది. మేళతాళాలు ఆమెకు వినబడుతూనే ఉన్నవి. కాని ఎందుకో ఆమెకు చూచే ఉత్సాహంలేదు. చిట్టికి ఆతల్లి దైన్యంగుర్తించే యీడు కాదు. "అమ్మా! చూచావూ" అన్నది సంతోషంతో. "ఏమిటమ్మా"అన్నది తల్లి. "వాళ్ళంతా సావిత్రీగారు నోమునోచుకోడానికి వెళ్లుతున్నారే, నేనూ నోచుకోవద్దూ" అన్నది ముద్దుగా చిట్టి. తల్లి ముఖ మింకా వాడిపోయింది. కనుకొలుకులు నీళ్లతో నిండినాయి. "ఏమేఅమ్మా! నాకుగూడా ఆనోము పట్టించవూ" అన్నది మళ్ళీ చిట్టి మారాముచేస్తూ. జవాబీయక తప్పలేదు తల్లికి "వాళ్ళంతా పెండ్లైనవా"ళ్ళన్నది తల్లి. "అయితే నాకూ అయిందిగా, నేనెందుకు పట్టకూడదు నోమూ"అన్నది చిట్టి మెళ్ళో మంగళసూత్రం చూపిస్తూ. తల్లి కండ్లవెంట నీళ్ళు బొటబొటవచ్చి చెక్కిళ్ళమీద జారినవి. చిట్టితెల్లబోయింది. శారదా ఆక్టురాబోయ్యేటప్పుడు తనకు మూడోయేటనే పెండ్లైందనీ, ఆ మరుసటేడే తనభర్తపోయినాడనీ తానిప్పుడు విధవననీ, తానేనోములూ వ్రతాలూ పట్టరాదనీ ఆ బాలకేమి తెలుసు?

ఆమె కిప్పుడు యేడేండ్లేగా పాపము!